ఉద్యమం మరింత ఉధృతం

- 6వ రోజుకు చేరిన మున్సిపల్ కార్మికుల సమ్మె
- నంద్యాల మున్సిపల్ కార్యాలయం ఎదుట దీక్ష



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

నంద్యాల టౌన్, డిసెంబరు 31 : రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్మికుల నిరవధిక సమ్మెను మరింత ఉధృతం చేస్తామని సీఐటీయూ, మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు హెచ్చరించారు. ఆదివారం తమ సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె ఆరో రోజుకు చేరింది. మున్సిపల్ కార్యాలయం ఎదుట సంఘం నాయకులు కృష్ణయ్య, భాస్కరాచారి అధ్యక్షతన దీక్ష నిర్వహించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం, పట్టణ అధ్యక్షుడు లక్ష్మణ్, కార్యదర్శి మహమ్మద్ గౌస్ కార్మికులనుద్దేశించి ప్రసంగించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు కూడా మున్సిపల్ కార్మికులు నోచుకోలేకపోతుండటం వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణికి నిదర్శనమని అన్నారు. కార్మికులు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం నిరవధిక సమ్మె చేస్తుంటే ప్రభుత్వానికి, అధికార పార్టీ నాయకులకు కంటికి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. అధికారంలోకి వస్తే కార్మికుల సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని చెప్పిన జగన్, వారి గోడు పట్టించుకోకపోవడం దారుణమని అన్నారు. ఇప్పటికైనా వైసీపీ ప్రభుత్వం దిగి వచ్చి మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించి న్యాయమైన కోర్కెలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు, సమాన పనికి సమాన వేతనం, ఆప్కాస్ వద్దని, స్కిల్డ్, సెమీ స్కిల్డ్ వేతనాలు అర్హులైన కార్మికులకు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రామకృష్ణ, ఆదాము, రామాంజనేయులు, నాగేశ్వరరావు, రమణ, సిద్ధయ్యతో పాటు భారీ సంఖ్యలో మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

వైభవంగా పల్లకీ ఉత్సవం

శ్రీశైలం, డిసెంబరు 31: శ్రీశైల క్షేత్రంలో లోక కల్యాణార్థం ఆదివారాన్ని పురస్కరించుకొని స్వామి, అమ్మవార్లకు పల్లకీ ఉత్సవం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో నిర్వహించిన ఉత్సవ కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతికి ప్రత్యేక పూజలు చేశారు. తరువాత ఉత్సవమూర్తులకు శాస్త్రోక్తంగా షోడశోపచార పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఘనంగా పల్లకీ ఉత్సవాన్ని నిర్వహించారు. నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన కె.సతీస్‌కుమార్ అనే భక్తుడు కుటుంబ సమేతంగా రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. స్వేచ్ఛా నృత్య తరంగిణి నాట్య శిక్షణాలయం, ఇచ్ఛాపురం బృందంచే సంప్రదాయ నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.

హ్యాపీ న్యూ ఇయర్



బేతంచెర్లలో దుకాణం వద్ద కొనుగోలుదారుల సందడి

నంద్యాల (కల్చరల్), డిసెంబరు 31: నూతన సంవత్సర వేడుకలను జిల్లా వాసులు ఆదివారం రాత్రి నుంచి ఘనంగా ప్రారంభించారు. పాత సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ కొత్త సంవత్సరాన్ని ఉత్సాహంగా, ఉల్లాసంగా ఆహ్వానించారు. ఆదివారం అర్ధరాత్రి కొత్త సంవత్సర స్వాగత వేడుకలు మిన్నంటాయి. కొత్త సంవత్సర కేక్‌ను కట్ చేసి పరస్పరం పంచుకుంటూ సంతోషంగా గడిపారు. తీపి చేదు కలయికలతో, కొందరికి సంతోషాన్ని, మరికొందరికి దుఃఖాన్ని, కొందరికి విజయాన్ని, మరికొందరికి వైఫల్యాలను పంచిన 2023 సంవత్సరానికి సెలవు పలుకుతూ కోటి ఆశలు, కొంగొత్త ఊసులతో 2024 సంవత్సరానికి స్వాగతం పలికారు. కొత్త ఏడాదిలో సంతోషంగా ఉండాలని కోరుకుంటూ కేక్‌లు, మిఠాయిలతో నోటిని తీపి చేసుకున్నారు. కొత్త సంవత్సర ఆరంభ సందర్భంగా ఆదివారం వివిధ ప్రాంతాల్లో బేకరీలు, స్వీట్ల దుకాణాలు సందడిగా కనిపించాయి. కేక్‌లు, స్వీట్ల కొనుగోళ్లకు ప్రజలు ఉత్సాహం చూపించారు. ప్రజా ప్రతినిధులు, అధికారులకు 'కొత్త సంవత్సర శుభాకాంక్షలు' తెలిపేందుకు బొకేలు, పూల దండలు కొనుగోలు చేయడం కానవచ్చింది. నగరంలో కొత్త సంవత్సర ఆరంభ వేడుకల్లో యువత సందడి చేశారు. ఆదివారం రాత్రి బైక్‌లపై తిరుగుతూ పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఎలాంటి అపశ్రుతులకు చోటు లేకుండా పోలీసు అధికారులు గట్టి చర్యలు తీసుకున్నారు.

దొంగల అరెస్టు

బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం



మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

నందికొట్కూరు రూరల్, డిసెంబరు 31 :నందికొట్కూరు సర్కిల్ పోలీసు స్టేషన్ పరిధిలోని రోళ్ళపాడు గ్రామ సమీపంలో ముగ్గురు దొంగలను అరెస్టు చేసి వారి వద్ద నుంచి బంగారు, వెండి నగలను స్వాధీనం చేసుకున్నట్లు ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు విలేకర్ల సమావేశంలో తెలిపారు. ఆదివారం నందికొట్కూరు సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మిడుతూరు మండలంలోని పీరు సాహెబ్ పేట గ్రామంలో ఈనెల 8 వ తారీకున దొంగతనం జరిగిందని ఒక ఇంటి యజమానురాలు గోపాలమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని వారు తెలిపారు. దర్యాప్తు చేస్తుండగా రోళ్ళపాడు వద్ద ముగ్గురు దొంగలను అరెస్టు చేశామని తెలిపారు. వారి వద్ద నుండి ఒక బైక్‌ను, 16.5 తులాల బంగారు, 120 తులాల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీటి విలువ సుమారు రూ 9.50 లక్షలు ఉంటుందన్నారు. దొంగలను ఆత్మకూరు పట్టణానికి చెందిన షేక్ ఖాదర్ బాషా, పాములపాడుకు చెందిన హరిప్రసాద్, ఇస్కాలకు చెందిన శ్రీనివాసులను అరెస్టు చేశామని తెలిపారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం



దాతకు ప్రసాదాలను అందజేస్తున్న పర్యవేక్షకులు

శ్రీశైలం, డిసెంబరు 31: శ్రీశైలం దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన కె. సతీస్‌కుమార్ అనే భక్తుడు కుటుంబ సమేతంగా వచ్చి రూ. లక్ష విరాళాన్ని ఆలయ పర్యవేక్షకుడు నాగరాజు అందజేశారు. దాతకు దేవస్థానం అధికారులు స్వామిశేషవస్త్రం, ప్రసాదాలను అందజేసి సత్కరించారు.

అనవసరంగా రైలు చైన్ లాగితే కేసు నమోదు చేస్తాం

కోసిగి, డిసెంబరు 31: గుంతకల్లు డివిజన్‌లోని ఆస్పరి, కుప్పగల్, కోసిగి, మంత్రాలయం రైల్వేస్టేషన్లను గుంతకల్లు డివిజన్ రైల్వే సీనియర్ డీపీవో చౌహాన్, సీనియర్ డీఎస్‌వో చంద్రశేఖర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడున్న ప్రయాణికులతో వారు మాట్లాడుతూ రైలులో ప్రయాణిస్తున్నప్పుడు రన్‌ఓవర్, చైన్ పుల్లింగ్ లెవెల్ క్రాసింగ్ వంటివి చేయరాదని తెలిపారు. అదేవిధంగా రైల్వేస్టేషన్లలో ప్లాట్‌ఫాం ఇటు నుంచి అటువైపు పట్టాలు దాటకూడదని అన్నారు. అనంతరం కోసిగి రైల్వేస్టేషన్‌లో మౌలిక వసతులు తాగునీరు, మరుగుదొడ్ల వంటి సౌకర్యాలు కల్పించాలని, అదే విదంగా పూణే, కన్యాకుమారి ఎక్స్‌ప్రెస్, రాయలసీమ ఎక్స్‌ప్రెస్ కోసిగి స్టేషన్‌లో ఆగే విదంగా చూడాలని గ్రామస్థులు రైల్వే అధికారులకు వినతి పత్రం అందజేశారు.

వైసీపీది దోపిడీ పాలన

వంద రోజుల్లో రాష్ట్ర ప్రజలకు ఆ పార్టీ నుంచి విముక్తి

చంద్రబాబు వస్తేనే ప్రజలకు ఉజ్వల భవిష్యత్తు

టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు కోట్ల సూర్య ప్రకాష్ రెడ్డి



డోన్‌లో టీడీపీ నాయకులతో మాట్లాడుతున్న కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి

డోన్, డిసెంబరు 31: వైసీపీ ప్రభుత్వం దోపిడీ పాలన సాగిస్తోందని మాజీ కేంద్ర మంత్రి, టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు కోట్ల సూర్య ప్రకాష్ రెడ్డి అన్నారు. ఆదివారం డోన్ పట్టణంలోని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వై.నాగేశ్వరరావు యాదవ్ స్వగృహంలో కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్ నియంత పాలన సాగిస్తూ, రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని మండిపడ్డారు. మద్యపాన నిషేధం, సీపీఎస్ రద్దు, ప్రతి యేటా జాబ్ క్యాలెండర్, రైతులకు మద్దతు ధర ఇలా ఎన్నో హామీలు అమలు చేయకుండా ప్రజలను వైసీపీ ప్రభుత్వం వంచించిందని ధ్వజమెత్తారు. భూ మాఫియా, మద్యం, ఇసుక మాఫియాలకు రాష్ట్రాన్ని కేరాఫ్‌గా మార్చి ఇష్టారాజ్యంగా దోచేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రానికి ఎలాంటి పరిశ్రమలు తీసుకురాకపోగా.. ఉన్న పరిశ్రమలను వెళ్లగొట్టిన ఘనత వైసీపీ ప్రభుత్వానికే దక్కిందన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో చంద్రబాబు హయాంలో చేపట్టిన సాగు నీటి ప్రాజెక్టులకు నిధులు ఇవ్వకుండా వైసీపీ ప్రభుత్వం చేసింది అన్యాయం కాదా అని ప్రశ్నించారు. సీఎం జగన్ చంద్రబాబు మీద కక్షతో రాష్ట్రానికి రాజధాని లేకుండా చేయడం చాలా దారుణమన్నారు. సైకో జగన్‌ను ఇంటికి సాగనంపేందుకు రాష్ట్ర ప్రజలంతా ఎదురు చూస్తున్నారన్నారు. మళ్లీ చంద్రబాబు వస్తేనే రాష్ట్ర ప్రజలకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, రాబోయే ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమి తిరుగులేని విజయంతో అధికారంలోకి వస్తుందని కోట్ల సూర్య ప్రకాష్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో టీడీపీ సీనియర్ నాయకుడు లక్ష్మీనారాయణ యాదవ్, ఓబులాపురం శేషిరెడ్డి, ఓంప్రకాష్, సీనాగేశ్వరరావు, చనుగొండ్ల శ్రీరాములు, జయరాముడు, ఖాజా, రవి, పాల్గొన్నారు.

నేటి స్పందన తాత్కాలిక రద్దు : ఎస్పీ

నంద్యాల క్రైం, డిసెంబరు 31 : ప్రతి వారం నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని ఈ సోమవారం తాత్కాలికంగా రద్దు చేసినట్లు ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అనివార్య కారణాలవల్ల జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని రద్దు చేసినందున జిల్లా ప్రజలు వ్యయప్రయాసాలతో నంద్యాలకు రావద్దని ఎస్పీ సూచించారు. వచ్చే సోమవారం యథావిధిగా పోలీస్ స్పందన కార్యక్రమం ఉంటుందని ఎస్పీ పేర్కొన్నారు.

అక్రమ కలప, వాహనాల పట్టివేత

పాణ్యం, డిసెంబరు 31 : పాణ్యం పరిధిలోని జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున అక్రమంగా కలప రవాణా చేస్తున్న రెండు వాహనాలను సీజ్ చేసినట్లు డీఆర్వో చంద్రహాసన్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ కర్నూలు వైపు వెళ్తున్న వాహనాన్ని తనిఖీ చేయగా వెదురు ముళ్ల కర్రలు, బూజు కర్రలను గుర్తించామన్నారు. అలాగే మరో వాహనాన్ని తనిఖీ చేయగా పట్టుడు కర్రలు, కర్రలు ఉన్నట్లు గుర్తించామన్నారు. ఈ కలపకు ఎటువంటి ప్రభుత్వ అనుమతి పత్రాలు లేకపోవడంతో సీజ్ చేసి స్థానిక పోలీసుస్టేషన్‌లో అప్పగించామన్నారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ తనిఖీ లో గోరుకల్లు ఎఫ్‌బీఓ అబ్దుల్‌కలాం, రామతీర్థం ఎఫ్‌బీఓ మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

బలపనూరులో కొండచిలువ

పాణ్యం, డిసెంబరు 31: బలపనూరు ఎస్సీ కాలనీలోని ఓ ఇంటి వద్ద ఆదివారం కొండచిలువ హల్‌చల్ చేసింది. కాలనీలోని వెంకటేశ్వర్లు తన ఇంటిలో 10 అడుగుల కొండచిలువను గమనించి పాణ్యం డిప్యూటీ రేంజ్ అధికారి చంద్రహాసన్‌కు సమాచారం ఇచ్చారు. డీ ఆర్వో సిబ్బందితో కొండచిలువను పట్టుకొని సుగాలిమెట్ట మూలతిరుగుడు ప్రాంతంలోని కంపార్ట్‌మెంట్ నెంబరు 134 కొండ ప్రాంతంలో వదిలివేశారు డివిజన్ ఫారెస్టు రిస్క్యూ టీం సిబ్బంది ప్రవీణ్, శ్రీరామచంద్రుడు, అటవీ సిబ్బంది జమాల్‌వలి, అబ్దుల్‌కలాం, మహేశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆగదు ఈ పోరాటం





నందికొట్కూరులో అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న మున్సిపల్ కార్మికులు, ఆత్మకూరులో గోవుకు వినతిపత్రాన్ని అందజేస్తున్న అంగన్‌వాడీలు

కార్మికులు, కష్టజీవుల బతుకు పోరాటం రోజు రోజుకూ ఉధృతం అవుతోంది. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించే వరకూ పోరాటం ఆపే ప్రసక్తే లేదని అంగన్‌వాడీ వర్కర్లు, మున్సిపల్ కార్మికులు ప్రతిన బూనారు. ఆదివారం నాటికి జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీ వర్కర్ల పోరాటం 20వ రోజుకు చేరింది. మున్సిపల్ కార్మికుల ఉద్యమం ఐదో రోజూ కొనసాగింది. 'ఎన్నికల ముందు నన్ను బలపర్చండి మీ సమస్యలు పరిష్కరిస్తామని జగన్‌మోహన్‌రెడ్డి నమ్మించి అధికారం చేపట్టారు. నాలుగున్నరేళ్లు గడిచాయి. ఇప్పటిదాకా మా బాధలపై కనీస పట్టింపు లేదు. ఈ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పేదాకా పోరుబాట వీడబోం'అంటూ ఆయా సంఘాల నాయకులు స్పష్టం చేశారు. నందికొట్కూరు పట్టణం కొత్తబస్టాండ్ నుంచి పటేల్ సెంటర్ వరకూ మున్సిపల్ కార్మికులు అర్ధనగ్నంగా ప్రదర్శన చేసి నిరసన తెలిపారు. ఆత్మకూరులో భిక్షాటన చేస్తూ ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణిని తూర్పారబట్టారు. అలాగే అంగన్‌వాడీ కార్మికులు నంద్యాలలో చేస్తున్న రిలే నిరాహార దీక్షలు 20వ రోజు చేరడంతో 20 అంకె ఆకారంలో కూర్చొని నిరసన తెలిపారు. వివిధ రూపాలలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తున్నా ప్రభుత్వం కనీసం పట్టించుకోవడం లేదంటూ మండిపడ్డారు. ప్రభుత్వ వైఖరి ఇలాగే కొనసాగితే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. - (ఆంధ్రజ్యోతి విలేకరులు)

ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలి

నంద్యాల (నూనెపల్లె), డిసెంబరు 31: సమస్యల పరిష్కారం కోసం నిరవధిక సమ్మె చేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని విడనాడాలని నాయకులు అన్నారు. నంద్యాలలో చేస్తున్న రిలేదీక్షలు 12వ రోజుకు చేరాయి. ఆదివారం దీక్షా శిబిరంలో ఉద్యోగులు ఒంటికాలుపై నిలబడి నిరసన తెలిపారు. విద్యాశాఖలో విలీనం చేసి క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ, సాహితీ స్రవంతి సమితి, వికలాంగుల సేవాసమితి, తదితర సంఘాలు దీక్షా శిబిరాన్ని సందర్శించి సమ్మెకు మద్దతు తెలిపారు.



మాట్లాడుతున్న ప్రజాసంఘాల నాయకులు

టీడీపీ అధికారమే ధ్యేయంగా పని చేయాలి

పాణ్యం, డిసెంబరు 31: టీడీపీ అధికారమే ధ్యేయంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని టీడీపీ మండల కన్వీనర్ గణపం జయరామిరెడ్డి అన్నారు. ఆదివారం పాణ్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీడీపీ మేనిఫెస్టోను ప్రజల్లోకి మరింత చురుగ్గా తీసుకువెళ్లేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని టీడీపీ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు మండలంలో పాణ్యం ఇన్‌చార్జి గౌరు చరిత ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ, భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాలు దాదాపు పూర్తయ్యాయన్నారు. ప్రస్తుతం ఎన్నికలు సమీపిస్తుండడంతో కార్యకర్తలు ఐక్యంగా మరింత ఉత్సాహంగా మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. పార్టీకి నష్టం కలిగించేవారిపై అధిష్ఠాన కమిటీ కఠిన చర్యలు చేపడుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ నారాయణమ్మ, నాయకులు రామగోవిందరెడ్డి, రాంమోహన్‌నాయుడు, ఖాదర్ బాషా, రామయ్య, రమణమూర్తి, దుబాయ్ శీను, సుబ్బయ్య, నాగేషుడు, కృష్ణ, రవి, పాల్గొన్నారు.

'మహానందిని నందన వనంగా మార్చుతా'

మహానంది, డిసెంబరు 31: మహానంది క్షేత్రాన్ని మరింత నందన వనంగా తీర్చిదిద్దుతానని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. ఆదివారం మహానంది ఆలయ పరిసరాల్లో రూ. 2 కోట్ల 50 లక్షల సొంత నిధులతో నిర్మిస్తున్న అభివృద్ధి పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. ఆలయం చుట్టూ ఇనుప గ్రిల్స్ నిర్మాణ పనులను పరిశీలించి నాణ్యతతో పాటు కొలతలు సమానంగా తీసుకొని నిర్మించాలని కార్మికులను ఆదేశించారు. అనంతరం నిశ్చితార్థమంటపం నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని ఈవో కాపు చంద్రశేఖర్‌రెడ్డి, చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి ఎమ్మెల్యేకు చూపారు.

మహానందిలో జేసీ పూజలు



మహానందిలో జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి

మహానంది, డిసెంబరు 31: మహానంది క్షేత్రంలో జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి దంపతులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరికి ఆలయ ముఖ మంటపం వద్ద ఏఈఓ మధు, అర్చకులు స్వాగతం పలికారు. జెసీ దంపతులు ప్రధాన ఆలయాల్లో భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. వేదపండితులు వీరిని శాలువాలతో సన్మానించి, తీర్థ ప్రసాదాలు అందజేసారు. ఈసందర్భంగా ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్‌రెడ్డి మహానంది ఆలయ భూములు అన్యాక్రాంతం కాకుండా ఉండేందుకు సర్వే నిర్వహించి హద్దులు ఏర్పాటు చెయ్యాలని జేసీని కోరారు. స్పందించిన తహసీల్దార్ జనార్దన్ శెట్టిని వచ్చే నెల 15వ తేదీతో రెవెన్యూ సమగ్ర భూ సర్వే పూర్తి అవుతుందని, వెంటనే మహానంది ఆలయ భూముల సర్వే కోసం ఇద్దరు సర్వేయర్లను నియమించాలని ఆదేశించారు.





కిటకిటలాడిన దుకాణాలు



వెలుగోడులోని బేకరీలో కేక్‌లు కొనుగోలు చేస్తున్న దృశ్యం

వెలుగోడు, డిసెంబరు 31: వెలుగోడు పట్టణంలో నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకొని పలు దుకాణాలు కిటకిటలాడాయి. హోటళ్లు బేకరీలు ప్రత్యేక ఆఫర్లు ప్రకటించడంతో దుకాణాలు వినియోగదారులతో కిటకిట లాడాయి. బేకరీలు, హోటళ్లు ప్రత్యేక వంటకాలతో ఆఫర్లు ప్రకటించాయి. దీంతో వెలుగోడు పట్టణం సందడిగా మారింది.

ఎమ్మెల్యే శిల్పాకు వినతి

మహానంది, డిసెంబరు 31 : న్యాయమైన సమస్యలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కార మార్గం చూపాలని అంగన్‌వాడీ వర్కర్లు ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డికి వినతి పత్రం అందజేశారు. సమ్మెలో భాగంగా 20 వ రోజు ఆదివారం మహానందిలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మహానందిలో ఒక కార్యక్రమం కు హాజరయ్యేందుకు వచ్చిన ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డిని కలిసారు. తమకు పనికి తగ్గ వేతనం ఇవ్వడంతో పాటు ఇతర బెనిఫిట్స్‌ను ఇవ్వాలని డిమాండ్ చేశారు.

వైభవంగా టెక్కె దర్గా ఉరుసు



విద్యుత్ దీపాల అలంకరణతో టెక్కె దర్గా

నంద్యాల (కల్చరల్), డిసెంబరు 31: నంద్యాల టెక్కెలో వెలసిన హజరత్ సయ్యద్‌షానూరుల్లా సాహెబ్ ఉరుసు మహోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు సయ్యద్ హాఫీజ్ అహ్మద్ ఖాద్రి బ్రదర్స్ ఆధ్వర్యంలో దర్గాను నూతనంగా విద్యుత్ దీపాలతో అలంకరించారు. అనంతరం దర్గాకు నూతన చాదర్‌ఘాట్, నైవేద్యాలు సమర్పించారు. భక్తులు కానుకలు, చక్కర సమర్పించారు.





నూతన ఉత్తేజంతో ముందుకెళ్దాం

- వైసీపీ విముక్త ఆంధ్రప్రదేశే అందరి లక్ష్యం
- శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి

ఆత్మకూరు, డిసెంబరు 31: కొత్త ఏడాదిలో నూతన ఉత్తేజంతో ప్రజలంతా కలిసి కట్టుగా ముందుకు వెళ్లాలని శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. ఆదివారం శ్రీశైల నియోజకవర్గ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. రానున్న ఏడాదిలో వైసీపీ విముక్త ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ప్రజలు కంకణబద్దులు కావాలని ఆకాంక్షించారు. ఇప్పటికే ఐదేళ్ల నిరంకుశ పాలనతో రాష్ట్రం అన్నివిధాలుగా వెనకబడిపోయిందని గుర్తుచేశారు. ఈ పరిస్థితుల్లో చంద్రబాబు నాయకత్వంతోనే రాష్ట్రానికి భవిష్యత్ ఉంటుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో దుర్మార్గపు వైసీపీ పాలన అంతమై ప్రజలందరూ ఆనందంగా జీవించాలని అన్నారు. కొత్త ఏడాదిలో టీడీపీ శ్రేణులు మరింత ఉత్సాహంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. టీడీపీకి మంచి రోజులు రాబోతున్నాయని, పనిచేసే ప్రతి కార్యకర్తకు తగిన ప్రాధాన్యత తప్పక ఉంటుందని వివరించారు.



బుడ్డా రాజశేఖరరెడ్డి





భక్తులకు 'తిరుప్పావై' ప్రవచనాలు

నంద్యాల (కల్చరల్), డిసెంబరు 31: గత 15 రోజుల నుంచి కొనసాగుతున్న తిరుప్పావై ప్రవచనాలు భక్తుల్లో ఉత్సాహాన్ని నింపాయి. నంద్యాల సంజీవనగర్ కోదండరామాలయంలో టీటీడీ ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్టు, నంద్యాల భగవత్ సేవా సమాజ్ కమిటీ సంయుక్త నిర్వహణలో నిర్వహిస్తున్న తిరుప్పావై ప్రవచనా కార్యక్రమానికి డాక్టర్ దివి హయగ్రీవాచార్యులు వాఖ్యాతగా వ్యవహరిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆదివారం 16 వ పాశురం గురించి వివరించారు. కార్యక్రమంలో భగవత్ సేవాసమాజ్ కమిటి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు రామతీర్థ అక్షింతలు పంపిణీ

నంద్యాల (కల్చరల్), డిసెంబరు 31: నంద్యాల గోపాల్‌నగర్‌లోని వరసిద్ధి వినాయక అభయాంజనేయస్వామి దేవాలయం నుంచి నగర సంకీర్తనలతో అయోధ్య తీర్థక్షేత్రం నుంచి తెచ్చిన అక్షింతలను సోమవారం ఇంటింటికీ పంపిణీ చేయనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. స్వామివారి అక్షింతలతో పాటు ఆహ్వాన పత్రిక, మందిర నమూనా చిత్రాల ప్రతికి ఇంటికీ అందజేస్తామని పేర్కొన్నారు.



విశ్వకర్మ విజయం పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

నంద్యాల (కల్చరల్), డిసెంబరు 31: నంద్యాల గాయత్రీమాత ఆలయంలో ఆదివారం సూరనసారస్వత సంఘం ఆధ్వర్యంలో డాక్టర్ శ్రీదేవి రచించిన విశ్వకర్మ విజయం పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ గెలివి సహదేవుడు, డాక్టర్ విశ్వరూపాచారి, డాక్టర్లు రామేశ్వరరెడ్డి, భార్గవ్‌రెడ్డి, నాగార్జునరెడ్డి, చిట్టిబొట్ల మధు సూదనశర్మ తదితరులు హాజరై విశ్వకర్మ పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో విజయలక్ష్మీ, గౌరీశంకర్, ఆలయ నిర్వాహకులు, మహమ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.







జిల్లా ప్రజలకు మంత్రి, కలెక్టర్ శుభాకాంక్షలు

నంద్యాల (కల్చరల్), డిసెంబరు 31: నూతన సంవత్సరంలోకి అడుగిడుతున్న సందర్భాన్ని పురస్కరించుకొని ఆర్థిక శాఖా మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ సమూన్, మైనార్టీ సంక్షేమాభివృద్ధి సలహాదారు హబీబుల్లా, ఎంపీ బ్రహ్మానందరెడ్డి, జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి, ఎస్పీ రఘువీర్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.





డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

'బాధితులకు న్యాయం చేయాలి'

డోన్(రూరల్), డిసెంబరు 31: చిన్నమల్కాపురం రైల్వేస్టేషన్ ప్రధాన రోడ్డులో ఇళ్లు కోల్పోయిన బాధితులకు న్యాయం చేయాలని సీపీఎం పట్టణ, మండల కార్యదర్శులు నక్కి శ్రీకాంత్, కోయలకొండ నాగరాజు, డీవైఎఫ్ఐ మండల కార్యదర్శి నక్కిహరి డిమాండ్ చేశారు. ఆదివారం సీపీఎం కార్యాలయంలో మాట్లాడుతూ నష్టపరి హారంలో అవకతవకలు జరిగాయని, బాధితులకు న్యాయం చేయాలని కోరారు.

బహుమతుల ప్రదానం

అవుకు, డిసెంబరు 31: రామాపురంలో టీడీపీ నాయకుడు ఎస్.రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీలు ఆదివారం హోరాహోరీగా కొనసాగాయి. మొదటి బహుమతి రామాపురానికి చెందిన ఇంద్ర టీం రూ.20,116, రెండో బహుమతి రామాపురంకు చెందిన రమ్మీటీం రూ.10,116, మూడో బహుమతి రమణ టీముకు రూ.5116 బహుమతిని ప్రదానం చేశారు.

జయప్రదం చేయండి: ఎస్టీయూ

కోవెలకుంట్ల, ఆగస్టు 31: ఎస్టీయూ వజ్రోత్సవాలను విజయవంతం చేయాలని రాష్ట్ర సహాధ్య క్షుడు చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని ఎస్టీయూ కార్యాలయంలో ఉయ్యాలవాడ, దొర్నిపాడు, సంజామల, కోవెలకుంట్ల, బనగానపల్లె, అవుకు మండ లాలకు చెందిన ముఖ్యనాయకుల సమావేశం సీనియర్ నాయకుడు వై.వెంకటరామిరెడ్డి అధ్యక్షతన నిర్వహిం చారు. చంద్రశేఖర్ మాట్లాడుతూ ఎస్టీయూ వజ్రోత్సవా లను జనవరి 12, 13 తేదీల్లో కర్నూలు ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎస్టీయూ నాయకులు పాల్గొన్నారు.

చర్చి పనుల పరిశీలన

చాగలమర్రి, డిసెంబరు 31: పెద్దబోదనం గ్రామంలో సీఎస్ఐ చర్చి పనులను బీజేపీ ఆళ్లగడ్డ ఇన్‌చార్జి భూమా కిషోర్‌రెడ్డి పరిశీలించారు. రూ.50 వేలు నగదును విరాళంగా అందించారు. కార్యక్రమంలో చర్చి ఫాదర్ సంపత్‌కుమార్, భూమా వర్గీయులు సింగం భరత్‌కుమార్‌రెడ్డి, రామ్‌నాథ్‌రెడ్డి, హరిశ్చంద్రా రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, నందీశ్వర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, చర్చి పెద్దలు పాల్గొన్నారు.

'వచ్చేది టీడీపీ ప్రభుత్వమే'



డోన్‌లో టీడీపీ ఎన్నికల సాంగ్‌ను రిలీజ్ చేస్తున్న నాయకులు

డోన్, డిసెంబరు 31: కొత్త ఏడాదిలో జరిగే ఎన్నికల్లో టీడీపీ ప్రభుత్వం రావడం ఖాయమని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ అన్నారు. ఆదివారం రాత్రి పట్టణంలోని గ్రాండ్ పవర్ ప్లే ఆవరణలో టీడీపీ ఎన్నికల సాంగ్‌ను విడుదల చేశారు. వలసల రామకృష్ణ మాట్లాడుతూ సీఎం జగన్ పాలన చూసి ప్రజలు అసహ్యించుకునే పరిస్థితి వచ్చిందన్నారు. త్వరలో జరిగే ఎన్నికల్లో చంద్రబాబును గెలిపించుకుని ముఖ్యమంత్రిగా చేసుకోవాలని రాష్ట్ర ప్రజలంతా సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సీఎం శ్రీనివాసులు, గంధం శ్రీనివాసులు, శ్రీనివాసులు యాదవ్, ప్రజావైద్యశాల మల్లికార్జున, ధర్మవరం చిన్న నాగిరెడ్డి, గౌతమ్ రెడ్డి, భరత్ రెడ్డి, అభిరెడ్డిపల్లె గోవింద్, జయన్న యాదవ్, మధుసూదన్‌గౌడు, సర్పంచ్ రామిరెడ్డి, చక్రపాణిగౌడు, కుమ్మరి సుధాకర్, ఎస్ఎండీ రఫీ, న్యాయవాది కృష్ణప్రసాద్, శ్రీరాములు పాల్గొన్నారు.

అహోబిలంలో రాపత్తు ఉత్సవాలు

ఆళ్లగడ్డ, డిసెంబరు 31: అహోబిలం లక్ష్మీనరసింహ స్వామి సన్నిధిలో అధ్యయనోత్సవాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం రాపత్తు ఉత్సవాలను అర్చకులు చేపట్టారు. ప్రహ్లాద వరదస్వామి, శ్రీదేవి, భూదేవి, గోదాదేవి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించి, అర్చకులు వేదపారాయణం చదివారు పావన నరసింహస్వామికి అహోబిలం పీఠాధిపతి రంగనాధయతీంద్ర మహాదేశికన్ ఆదివారం పూజలు చేశారు. ఆయన వెంట అర్చకులు ఉన్నారు.





'వలంటీర్ల గౌరవ వేతనం పెంచాలి'

సంజామల, డిసెంబరు 31: రాష్ట్రంలో పనిచేస్తున్న వలంటీర్లకు గౌరవ వేతనం పెంచాలని జేఏసీ జిల్లా అధ్యక్షుడు అందనం దేవరాజు డిమాండ్ చేశారు. నెలకు రూ.5 వేలకు వలంటీర్లు పనిస్తున్నారని, గౌరవ వేతనం పెంచుకుంటే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

కూలిన పాఠశాల ప్రహరీ

రుద్రవరం, డిసెంబరు 31: మండలంలోని యల్లావత్తుల ఉన్నత పాఠశాల ప్రహరీ కూలిపోయింది. ఆదివారం కావడంతో విద్యార్థులు లేకపోవడం వల్ల ఎలాంటి ప్రమాదం జరగలేదు. అయితే విద్యార్థులు ఉండి ఉంటే పరిస్థితి ఏమిటని పలువురు ఆందోళన వ్యక్తం చేశారు.

'మధ్యంతర భృతి ప్రకటించాలి'

కోవెలకుంట్ల, డిసెంబరు 31: ఉద్యోగ, ఉపాధ్యాయులకు మధ్యంతర భృతి చెల్లించాలని జాతీయ ఉపాధ్యాయ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షరీఫ్ కోరారు. ఆదివారం ఆయన కోవెలకుంట్లలో మాట్లాడుతూ గత పీఆర్‌సీలో న్యాయం జరుగలేదని, ఈ పీఆర్‌సీలోనైనా న్యాయం చేయాలని కోరారు.

'పెండింగ్ బకాయిలు చెల్లించాలి'

చాగలమర్రి, డిసెంబరు 31: ఉపాధ్యాయుల, ఉద్యోగుల పెండింగ్ బకాయిలను తక్షణమే చెల్లించాలని యూటీఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ సభ్యుడు డెన్నిజాన్సన్, జిల్లా కౌన్సిలర్లు అన్నారు. ఆదివారం యూటీఎఫ్ కార్యాలయంలో వారు మాట్లాడుతూ ప్రతి నెల 1వ తేదీన జీతాలు చెల్లించాలని కోరారు.





20వ రోజు సమ్మె

డోన్(రూరల్), డిసెంబరు 31: డోన్‌లోని ఐసీడీఎస్ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ అంగన్‌వాడీలు చేపట్టిన దీక్ష ఆదివారం 20వ రోజుకు చేరుకుంది. అంగన్‌వాడీలు ఆటపాటలతో నిరసన తెలిపారు. సీపీఐ నాయకులు, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

● డోన్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె ఆదివారం 20వ రోజుకు చేరుకుంది. సీపీఎం, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

బేతంచెర్ల: బేతంచెర్లలోని సీఐటీయూ కార్యాలయ ప్రాంగణంలో ఆటపాటలతో అంగన్‌వాడీలు నిరసన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ: అంగన్‌వాడీ కార్యకర్తలు ఆదివారం సమ్మె సాగించారు. కార్యకర్తలు కబడ్డీ, కోకో ఆడి నిరసన తెలిపారు.

శిరివెళ్ల: శిరివెళ్ల తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ సిబ్బంది మానవహారంగా ఏర్పడి నిరసన వ్యక్తం చేశారు.

రుద్రవరం: రుద్రవరంలో అంగన్‌వాడీలు ఆటపాటలతో నిరసన తెలిపారు. కబడ్డీ, కోలాటం ఆడారు. రైతు సంఘం, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

చాగలమర్రి: చాగలమర్రిలో అంగన్‌వాడీల సమ్మెకు జనసేన పార్టీ తరపున ఆళ్లగడ్డ నియోజకవర్గ ఇన్‌చార్జి ఇరిగెల రాంపుల్లారెడ్డి కార్యకర్తలతో కలిసి ఆదివారం సంఘీభావం తెలిపారు. ఆయన మాట్లాడుతూ వైసీపీ చేతకాని దద్దమ్మ ప్రభుత్వం అన్నారు. అంగన్‌వాడీలు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోక పోవడం దారుణమన్నారు. జనసేన నాయకులు ఇరిగెల సూర్యనారాయణరెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, జున్ను ప్రసాదురెడ్డి, సుధాకర్‌రెడ్డి, సుబ్బయ్య, ఉప్పు మాబాషా, జయసూర్య, రామకృష్ణ, జనసేన యూత్ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బనగానపల్లె: పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు మ్యూజికల్ చైర్స్, కబడ్డీ ఆడి నిరసన వ్యక్తం చేశారు. సీఐటీయూ, అంగన్‌వాడీ వర్కర్స్‌అండ్ హెల్పర్స్ యూనియర్ నాయుకలు పాల్గొన్నారు.



సంజామలలో కబడ్డీ అడుతూ నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీలు



చాగలమర్రిలో మద్దతు తెలుపుతున్న జనసేన పార్టీ నాయకులు

కొలిమిగుండ్ల: కొలిమిగుండ్ల తహసీల్దారు కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు కబడ్డీ ఆడి నిరసన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

కోవెలకుంట్ల: పట్టణంలోని గ్రామ పంచాయతీ సర్కిల్‌లో అంగన్‌వాడీలు మానవహారం నిర్వహించారు. ప్లేట్లు, గరిటెలతో శబ్దం చేసి నిరసన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

సంజామల: సంజామలలో కబడ్డీ ఆడి అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.











జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ



మెడల్, సర్టిఫికెట్ అందుకుంటున్న పద్మజ

రుద్రవరం, డిసెంబరు 31: విశాఖపట్టణం ఆర్‌కే బీచ్‌లో నిర్వహించిన జాతీయ బీచ్ గ్రాప్లింగ్ పోటీల్లో కొండమాయపల్లె గ్రామానికి చెందిన గురప్ప - పుష్పలత దంపతుల కుమార్తె పద్మజ మూడో స్థానంలో నిలిచింది. ఆదివారం ఇండియన్ బీచ్ గ్రాప్లింగ్ ప్రెసిడెంట్ దినేష్‌కపూర్, సెక్రటరీ బ్రిజ్‌శర్మ, ఏపీ ప్రెసిడెంట్ సురేంద్రరెడ్డి చేతుల మీదుగా మెడల్, సర్టిఫికెట్ అందుకున్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

బనగానపల్లె, డిసెంబరు 31: మండ లంలోని నందవరం చౌడేశ్వరీ మాత ఆలయాభివృద్ధికి రూ.50 వేలు విరాళం భక్తులు ఆదివారం ఆలయ ఈవో రామానుజన్‌కు అందించారు. హైదరాబాద్‌కు చెందిన దాట్ల హరిప్రసాద్‌రెడ్డి, లక్ష్మికల్పన దంపతులు ఆలయ ఈవో రామానుజన్‌కు విరాళం అందించారు.

ఆర్థిక సాయం అందజేత

కొలిమిగుండ్ల డిసెంబరు 31: మండలంలోని బందార్లపల్లె గ్రామానికి చెందిన పెద్దిరాజు మోటారు సైకిల్ ప్రమాదంలో కాలుపోగొట్టుకొని వైకల్యం పొందారు. పోతిరెడ్డి రామసుబ్బారెడ్డి ట్రస్టు అధ్యక్షుడు పోతిరెడ్డి వెంకట సుబ్బారెడ్డి రూ.20 వేలు ఆదివారం బాధితునికి అందించారు.

శిరివెళ్ల: మండలంలోని యర్రగుంట్ల గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు తాళ్లూరి బాబు అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన కుటుంబానికి రూ.10 వేలు ఆర్థిక సాయాన్ని టీడీపీ నాయకులు ఆదివారం అందజేశారు. బాబు కుటుంబ సభ్యులను పరామ ర్శించి టీడీపీతో పాటు తాము సైతం వారికి అన్ని విధాలా అండగా ఉంటా మని భరోసా ఇచ్చారు. ఎంపీటీసీ-2 కమతం జయరామిరెడ్డి, బీసీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ శీలం లక్ష్మీప్రసాద్, లింగమయ్య, రాము, సుబ్బయ్య, అంజనే యులు, కమతం సుబ్బారెడ్డి, నారాయణ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమ్మె

ఆళ్లగడ్డ, డిసెంబరు 31: మున్సిపల్ కార్మికుల సమ్మె ఆదివారం కొనసాగింది. వీరి సమ్మెకు బీజేపీ నాయకుడు భూమా కిశోర్‌రెడ్డి ఆదివారం మద్దతు ప్రకటించారు. ఆయను మాట్లాడుతూ అధికారంలో ఉన్న ప్రజా ప్రతినిధులు పట్టించుకోక పోవడం వారి చేతకాని తనానికి నిదర్శనమన్నారు. ప్రజల కోసం శ్రమిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలను, మున్సిపల్ కార్మికుల సమస్యలను గాలికి వదిలేశారని ఆరోపించారు.

పుట్టాలమ్మకు పూజలు

ఆళ్లగడ్డ, డిసెంబరు 31: ఆళ్లగడ్డ మండలంలోని రామతీర్థం పుట్టాలమ్మ క్షేత్రంలో అమ్మవారికి పూజలు చేయడానికి భక్తులు బారులు తీరారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చి అమ్మవారికి పూజలు చేసి మొక్కుబడులు తీర్చుకున్నారు. భక్తులకు అర్చకులు అన్నదానం చేశారు.







